www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 జులై 2023



ఆయిల్‌పామ్ టన్నుకు రూ.18 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో మంగళవారం రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.23 వేలు ధర ఉంటే క్రమంగా ఆ ధర రూ.13 వేలకు పడిపోయిందన్నారు. ధర పెరిగిన క్రమంలో కౌలు రేట్లు భారీగా పెంచేశారని, మరోవైపు ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగిపోయాయని చెప్పారు. ఫలితంగా ఆయిల్ పామ్ రైతులు నష్టపోతున్నారని ఆందోళన చేశారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని నూతన టెక్నాలజీ మిషనరీతో ఆధునికీకరించాలన్నారు. ఆయిల్ రికవరీ శాతాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్ వా(వే)డీ..!

36 గంటల మహాధర్నాలో రాత్రంతా కలెక్టరేట్ వద్ద నిద్ర

స్పందించని ప్రభుత్వం, అధికారులు

ఆగ్రహంతో కలెక్టరేట్ దిగ్బంధనం

పోలీస్ వలయం, బారికేడ్లు తోసుకుంటూ ముందుకు

అంగన్‌వాడీల నినాదాలతో మార్మోగిన కలెక్టరేట్ ప్రాంగణం

దిగొచ్చిన అధికారులు

ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని హామీ



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు


కలెక్టరేట్‌లోకి వెళ్తున్న అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ ఏలూరు అర్బన్

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 36 గంటలు ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీల ఆగ్రహం రెండోరోజు మంగళవారం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వం, అధికారుల నుంచి కనీస స్పందన లేకపోవడంతో అంగన్‌వాడీలంతా కలెక్టరేట్ ముట్టడికి దిగారు. వేలాదిమంది అంగన్‌వాడీల సమూహం పోలీస్ వలయం, బారికేడ్లను దాటుకుని కలెక్టరేట్ ప్రధాన గేటువద్ద బైఠాయించింది. సమస్యలపై అంగన్‌వాడీలు చేసిన నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. అధికారులు దిగొచ్చి వినతిపత్రం స్వీకరించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో అంగన్‌వాడీలు ధర్నా విరమించారు.


వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన 36 గంటల ధర్నా ఏలూరు కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు ఏలూరు జిల్లా నలుమూలల నుండి మంది అంగన్‌వాడీలు తరలివచ్చారు. గత 36 గంటలుగా కలెక్టరేట్ వద్ద బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ వద్ద నిద్రించి వర్షంలో తడుస్తూనే తమ నిరసన కొనసాగించారు. అయినప్పటికీ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్‌వాడీల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో కలెక్టరేట్ ముట్టడించారు. కలెక్టరేట్ రోడ్డులో ఏర్పాటు చేసిన పోలీసు వలయాన్ని ఛేదించుకుని, బారికేడ్లను తోసుకుంటూ కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్దకు చేరుకుని అక్కడ బైఠాయించారు. వేలాదిమంది అంగన్‌వాడీలు అక్కడకు చేరుకుని సమస్యలపై నినదించడంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా దద్దరిల్లింది. జిల్లా అధికారులు వచ్చి తమ సమస్యలపై స్పందించే వరకూ కదిలేదిలేదని భీష్మించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యుటీ ఇవ్వాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెద్దపెట్టున నినదించారు. అంగన్‌వాడీల ఆందోళనకు స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ మూర్తి అంగన్‌వాడీల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అంగన్ వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మద్దతు

మహాధర్నాలో భాగంగా రెండో రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అంగన్‌వాడీల ఆందోళనకు పూర్తిమద్దతు పలుకుతూ మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అంగన్‌వాడీలు రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టరేట్లను ముట్టడించి ఆందోళన చేస్తున్నా జగన్ ప్రభుత్వం స్పందించకపోవడం అమానుషమన్నారు. ప్రభుత్వంతోపాటు జిల్లా అధికారులు కనీసం అంగన్‌వాడీలను పలకరించి వాళ్ల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా నాలుగేళ్ల కాలంలో అంగన్‌వాడీల సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు. నాలుగేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా వేతనాలు మాత్రం పెంచలేదన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ పక్షాన అనేకసార్లు అంగన్‌వాడీల సమస్యలు ప్రస్తావించామని, అయినా ప్రభుత్వం వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని బట్టే చిరుద్యోగులపై జగన్ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ తెలుస్తోందని ఎద్దేవా చేశారు. జగన్ స్పందించి అంగన్‌వాడీల వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు.

ఐసిడిఎస్ నిర్వీర్యానికి మోడీ కుట్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసే కుట్రలో భాగంగా ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. అంగన్‌వాడీలంతా నిరవధిక సమ్మెకు కూడా సిద్ధపడి ఉండాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.హైమావతి, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ గోవింద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, టి.మాణిక్యం, పిఎల్ఎస్.కుమారి, విమల, మీన, రాజకుమారి, తులసి, సరోజని, బిజెఎస్.కుమారి, రాజమణి, పుష్ప, లత, సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, జి.రాజు, వివిధ సంఘాల నాయకులు ప్రసాద్, నారపల్లి రమణారావు, ఎస్.రాంబాబు, ఎం.నాగమణి, వి.సాయిబాబు, గోపి, బి.జగన్నాధం, రైతుసంఘం నాయకులు కె.శ్రీనివాస్ నాయకత్వం వహించారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

డబ్బు, పదవులతో నన్ను కొనలేరు

వాలంటీర్లపై కోపం లేదు


సిఎం జగన్ విధానాలు దారుణం

ఆడపిల్లల అదృశ్యంపై నోరుమెదపని వైసిపి

ప్రజాధనం దుర్వినియోగం చేస్తే నిలదీస్తాం

సమస్యను పక్కదోవ పట్టించడానికి వైసిపి ప్రయత్నం

దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గ సమీక్షలో పవన్‌కల్యాణ్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నన్ను డబ్బుతో, పదవులతో కొనలేరు, రూల్ ఆఫ్ లాను నమ్ముతాను. దేశం, సమాజం తప్ప తనకు ఏమీ తెలీయవు..' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. వారాహి రెండోవిడత యాత్రలో భాగంగా మూడోరోజు ఏలూరులోని క్రాంతి కళ్యాణ మండపంలో దెందులూరు, ఉంగుటూరు నియోజవర్గాల నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధానాలపై మాట్లాడితే 'వదలమంటే పాముకి కోపం, వద్దంటే కప్పకి కోపం' అన్నట్లు పరిస్థితి తయారైందన్నారు. కొల్లేరు పర్యావరణ కాలుష్యంపై మాట్లాడితే ఆక్వారైతులు ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు. అంబేద్కర్ చెప్పినట్లు రూల్ ఆఫ్‌లాను తాను నమ్ముతానన్నారు. సమస్యలపై అవసరమైతే చొక్కాపట్టుకుని నిలదీయాలని, న్యాయం పోరాటం చేయాలన్నారు. దళితులు జగన్‌ను తమవాడంటూ ఎత్తేశారని, అధికారంలోకి రావడంతోనే విదేశీ విద్యను తీసేశారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వాలంటీర్లపై తనకు కోపంలేదని, వారి పొట్టకొట్టాలన్న ఉద్దేశమే లేదన్నారు. న్యాయవ్యవస్థ, శాసన వ్యవ్యవస్థ, బ్యూరోక్రసీ వంటి వ్యవస్థలుండగా సమాంతరంగా మరో వ్యవస్థ ఎందుకన్నారు. వాలంటీర్లను నిలదీసే పరిస్థితి లేదన్నారు. ఉపాధి కూలీలకు ఇచ్చే వేతనం కూడా వాలంటీర్లకు ఇవ్వడం లేదన్నారు. వాలంటీర్ వ్యవస్థ, రేషన్ వ్యాన్లు లేకపోతే ఇంతకుముందు దేశం ఆగిపోయిందా అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని విశ్వసిస్తే ఇలాంటి ఆలోచనలు రావన్నారు. 2019 నుంచి 2021 మధ్యలో 29,279 మంది ఆడపిల్లలు అదృశ్యమైనట్లు పార్లమెంట్‌లోనే లెక్కలు చెప్పారన్నారు. పెగాసిస్ సాఫ్ట్‌వేర్‌పై బిజెపిపై తీవ్ర వ్యతిరేకత ఉందని, వాలంటీర్లతో వ్యక్తిగత సమాచారం సేకరించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. జగన్ ఇంట్లో ఏం చేసినా మనకెందుకని, అలాగే ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛను హరించకూడదన్నారు. జగన్ పబ్జి, ఆన్‌లైన్ గేమింగ్ ఆడుతున్నప్పటికీ ఇబ్బందిలేదని, ప్రజల డబ్బుతో ఆడితే నిలదీస్తామన్నారు. తన వ్యక్తిగత విషయాలపై చర్చాగోష్టులు పెట్టే మీడియా వేలాది మంది ఆడపిల్లల అదృశ్యంపై చర్చలు ఎందుకు పెట్టడం లేదన్నారు. ప్రొద్దుటూరులో దళిత బాలికపై అత్యాచారం జరిగితే ఎప్పటికో స్పందించారని, నిందితులను వదిలేశారో ఉంచారో కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. తమ ఇంట్లో ఆడపిల్ల అదృశ్యమైతే ఇలా మాట్లాడతారా అని ప్రశ్నించారు. విషయాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. తాను సరైన పాయింట్ ఎత్తానని వీరి ప్రవర్తను బట్టి అర్థమవుతుందన్నారు. రాష్ట్రాన్ని పీడిస్తున్న జగన్ అనే జలగను వదిలించుకోవాలన్నారు. కిరాయి మూకలను దింపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఫ్యాక్షనిస్టులతో జగన్ పెట్టుకున్నాడే తప్ప విప్లవకారులతో పెట్టుకోలేదన్నారు. మద్యం నుంచి దోచిన రూ.30 వేల కోట్లు వాలంటీర్లకు ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని కోరారు. సంస్కార హీనుడు సిఎం అయితే ఎలా ఉంటాడో ఈతరం జగన్‌ను చూసి తెలుసుకోవాలన్నారు. అమ్మఒడి సభలో పిల్లల ముందు ఆయన మాట్లాడిన మాటలే అందుకు నిదర్శమన్నారు. 'నేను పెద్దహీరోనే.. ఏడాదికి రూ.400 కోట్లు సంపాదించగలను.. జగన్‌లా ఆన్‌లైన్ గేమింగ్ ఆడుకోవచ్చు.. కానీ అలాంటి మనస్తత్వం నాకు లేదు.. 18 ఏళ్ల వయస్సులోనే దేశం, సమాజం కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను..' అని స్పష్టం చేశారు. జగన్ తన వ్యవహారశైలితో రేపిస్టులను పెంచిపోషిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, నియోజకర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థపై కోర్టులో ఛాలెంజ్ చేస్తాం..!

వ్యక్తిగత డేటాను సేకరించడం చట్టవిరుద్ధమని, జగన్ వాలంటీర్ల చేత వ్యక్తిగత డేటాను సేకరించడం, ఆ వ్యవస్థపై కోర్టులో ఛాలెంజ్ చేస్తామంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. ఏలూరు క్రాంతి కళ్యాణ మండపంలో ఉంగుటూరు నియోజవర్గనేతలతో, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పవన్ మాట్లాడారు. డబ్బు సంపాదించాలని పోటీపడితే ఏడాదికి రూ.వెయ్యి నుంచి రూ.1500 కోట్లు సంపాదిస్తానన్నారు. 18 ఏళ్ల వయస్సులోనే సమాజం వైపు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. విద్య, చదువు ప్రజలకు ప్రాథమిక హక్కులన్నారు. వివాహమైన మహిళ గురించి ప్రస్తావించాలంటే భార్య, సతీమణి అని అంటామని, జ్ఞానంలేని జగన్ మాత్రం పెళ్లాం అంటూ సంబోదిస్తారన్నారు. సంస్కారంలేని, క్యారెక్టర్ లేని వ్యక్తి జగన్ అని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థ సంఘ విద్రోహ శక్తులకు ఉపయోగపడుతుందన్నారు. 50 కుటుంబాలకు ఒక జగన్ తయారయ్యాడన్నారు. వ్యక్తిగత సమాచారం వాలంటీర్లకు ఇవ్వొద్దన్నారు. జనాలకు జనసేన కాపాలా కాయాలన్నారు. జగన్ అనే వ్యక్తి ఉంటే పవన్‌కల్యాణ్ ఉంటాడన్నారు. ఒక కొడుకుని దేశానికి ఇచ్చేశానని అనుకోమని అమ్మకు చెప్పానన్నారు. వైసిపిని ప్రశ్నించి, ఎదుర్కోవాలంటే కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఉంగుటూరు : ఏలూరు నుంచి మంగళవారం సాయంత్రం బయలుదేరిన జనసేన అధినేత పవన్ వారాహి వాహనానికి ఉంగుటూరులో ఘనస్వాగతం లభించింది. అభిమానులు, జనసేన కార్యకర్తలు, ప్రజానీకం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండలంలో కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, బాదంపూడి మీదుగా యాత్ర సాగింది. అన్ని చోట్లా ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి రాత్రికి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి పవన్ చేరుకున్నారు.

గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం విద్యార్థి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉర్రింక గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మి దంపతుల కుమారుడు గోగుల అఖిల్‌వర్ధన్‌రెడ్డి(11) సంక్షేమ హాస్టల్లో ఉంటూ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఎప్పటి లాగే సోమవారం రాత్రి హాస్టల్లో భోజనం చేసి నిద్రపోయాడు. ఉదయం తోటి స్నేహితులు లేచిచూసేసమయానికి అఖిల్‌వర్ధన్‌రెడ్డి కనిపించలేదు. చుట్టుపక్కల వెతకడంతో హాస్టల్ సమీపంలో మృతిచెంది కనిపించాడు. వెంటనే విద్యార్థులు నైట్‌వాచ్‌మెన్ రాజేష్‌కు సమా చారం అందించారు. ఆయన హాస్టల్ వార్డెన్‌కు, పోలీసులకు సమా చారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


మృతిచెందిన విద్యార్థి


ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

'విద్యార్థులందరూ వెళ్లిపోండి'

ఇదిలా ఉండగా విద్యార్థి చేతిలో లభించిన ఉత్తరం విద్యార్థులను, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. ఆ ఉత్తరంలో 'ఈ పాఠశాలలో చదువుతున్న మిగిలిన విద్యార్థులు అందరూ వెళ్లిపోవాలి.. లేకుంటే ఈ విద్యార్థికి పట్టిన గతే మీకూ పడుతుంది' అని ఉంది. ఇది చూసిన తోటి విద్యార్థులు కంగారుపడుతున్నారు.

హత్యచేసి ఉండొచ్చు : ఐటిడిఎ పిఒ

హాస్టల్ వార్డెన్ చెప్పిన వివరాలను పరిశీలిస్తే అఖిల్ వర్ధన్ రెడ్డి(11)ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు తెలుస్తోందని ఐటిడిఎ పిఒ సత్యనారాయణ తెలిపారు. కొందరు వ్యక్తులు హాస్టల్ నుండి బయటకు తీసుకొచ్చి స్కూల్ ఆవరణలో హత్య చేసి ఉండొచ్చని తెలిపారు. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు హాస్టల్‌కు వచ్చి విద్యార్థులపై టార్చ్‌లైట్ వేసి వెతికినట్లు వార్డెన్ అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు. వారు ఎవరు? ఎందుకు హత్య చేయాల్సి వచ్చింది? లేక హత్యా?కాదా? అస్సలు ఏమై ఉంటుందో? వంటి కారణాలపై సమగ్ర విచారణ చేస్తున్నామని చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, ఐటిడిఎ, ఎంపిడిఒ తదితర అధికారులతో పాటు రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు వి.సోమశంకర్ నాయక్, ఎస్‌పి మేరీ ప్రశాంతి సఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ముగ్గురు సస్పెన్షన్

విద్యార్థి మృతి కేసులో భాగంగా రాష్ట్ర గిరిజన కమిషన్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చిన్న గంగరాజును, డిప్యూటీ వార్డెన్ కె.శ్రీనివాస్‌ను, వాచ్‌మెన్ ఎం.రాజేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సత్యనారాయణ తెలిపారు. బాధిత కుటుంబానికి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నిబంధనల ప్రకారం రావాల్సిన అన్ని ప్రయోజనాలు అందేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజా సంఘాల ఆందోళన

కారకులను గుర్తించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రగతిశీల విద్యార్థి సంఘం, ఎపి గిరిజన సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ, రైతు కూలీ సంఘం, ఇతర పలు సంఘాలు పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. హాస్టల్, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

విద్యార్థి మరణంపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్ నాయక్ అన్నారు. హాస్టల్‌ను మంగళవారం సందర్శించి బాలుడి మృతికి సంబంధించిన వివరాలను హాస్టల్ సిబ్బందిని, ఐటిడిఎ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమశంకర్ మాట్లాడుతూ కేసు దర్యాప్తుకు రెండు బృందాలను నియమించారని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసి నిందితులను శిక్షిస్తామన్నారు.

పోలవరం : విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పోలవరంలో ఆయన నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులిరామన్నగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి లేకపోయినా అరాచకాలకు లోటు లేకుండా పోయిందని ఆయన విమర్శించారు.


మధ్యాహ్న భోజనం భుజిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మధ్యాహ్న భోజన మెనూను నిత్యం పరిశీలించాలి

ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మధ్యాహ్నం భోజన పథకం మెనూను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ పరిశీలించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏడో డివిజన్ తూర్పు నగరపాలక హిందూ బాలిక ప్రాథమికోన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వండిన భోజన పదార్థాలను, వాటి నాణ్యతను కలెక్టర్ స్వయంగా భుజించి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఫిల్టర్ వాటర్‌ను కలెక్టర్ తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు అందిస్తున్న స్కూల్ బ్యాగుల పంపిణీ గురించి ఉపాధ్యాయరాలిని అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పథకం ద్వారా నిర్మిస్తున్న నూతన తరగతి గదిని కలెక్టర్ పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయుణ్ని, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంచటానికి అవసరమైన మొక్కలను స్కూలు ఆవరణలో నాటాలని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా డివిజన్ కార్పొరేటర్ల సమక్షంలో పాఠశాలలో కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక ఏడో డివిజన్ తూర్పు నగరపాలక హిందూ బాలిక ప్రాథమికోన్నతపాఠశాల వద్ద 6, 9, 13 వార్డు సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, అర్జీల పరిశీలన కౌంటరు, ఆధార్ నమోదు కౌంటరు, సేవల అభ్యర్థన కౌంటరు, అర్జీల నమోదు కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి అర్జీల నమోదు, ఆధార్ నమోదుకు సంబంధించిన వివరాలను, సాంకేతికపరమైన సమస్యలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్షతతో సులువుగా ధృవపత్రాలను పొందొచ్చని అర్హులందరూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన ధృవపత్రాలు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెలరోజులు పాటు నిర్వహిస్తుందని, వార్డు ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన పూడిక పనులు తక్షణం చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఏలూరు నగరపాలక కమిషనర్‌ను ఆదేశించారు.

డిగ్రీ విద్యార్థులకు తరగతి గదుల కేటాయింపు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అసౌకర్యం లేకుండా తరగతుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008లో ఏర్పాటు చేశారు. అప్పటి నుండి డిగ్రీ కళాశాల తరగతులు స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. 2020 ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. ఆ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అనువైన స్థలం లభించని కారణంగా నిధులు వినియోగించలేదు. అనంతరం స్థలాన్ని 2021 అక్టోబర్‌లో కలెక్టర్ కేటాయించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు తరగతి గదుల విషయమై కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. దీనిపై కలెక్టర్ స్పందించి గతనెల రెండో తేదీన కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను స్వయంగా సందర్శించి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ఒకే భవనంలో తరగతి గదులను కేటాయించాలని కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గదులు కేటాయించారు.

జనాభా నియంత్రణపై అవగాహనకు కృషి : కలెక్టర్

ఏలూరు:సమానత్వం, ప్రాథమిక హక్కులు, పేదరికం, పర్యావరణం, జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉత్తమ పనితీరును కనపరచిన డాక్టర్లకు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు లక్కీడిప్ ద్వారా కుటుంబ నియంత్రణ పాటించిన వారికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రశంసాపత్రాలు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈనెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనాభా పెరుగుదలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, మరిముఖ్యంగా వైద్యులు శాశ్వత, తాత్కాలిక పద్ధతులు (కుటుంబ నియంత్రణ) ప్రజలు అవలంభించేలా ప్రోత్సహించాలని ఇందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ హితువు పలికారు.

సొసైటీ అధ్యక్ష పదవి కోసం పోటా పోటీ

ప్రజాశక్తి - ముసునూరు

మండలకేంద్రమైన ముసునూరు సొసైటీ కో ఆపరేటివ్లో గ్రామంలోని 472 మంది రైతులు బయట అదనపు వడ్డీలకు బయపడి ప్రభుత్వం తక్కువ వడ్డీకి రుణసదుపాయం కల్పించడంతో, కొన్ని కోట్ల రూపాయలు విలువ చేసే భూములను తాకట్టు పెట్టి, క్రాప్, ఎల్టి అనుబంధ రుణాలు రూ.18 కోట్ల వరకూ తీసుకొన్నారు. సొసైటీ ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి 885 మంది సభ్యత్వం పొందారు. మొత్తంగా సుమారు ముసునూరు సొసైటీలో అధిక మొత్తంలో రూ.36కోట్ల టర్నోవర్ జరుగుతోందని చెప్పొచ్చు. సొసైటీ అధ్యక్ష పదవి కోసం 'నువ్వా - నేనా' అంటూ ఒకే పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పోటీ పడటం గమనార్హం. ప్రస్తుతం అధ్యక్ష పదవిలో ఉన్న మానికల శ్రీనివాసరావు అనారోగ్యం బారినపడి రాజీనామా చేయడంతో, అధ్యక్ష పదవి కోసం బిసి, ఒసి నాయకుల మధ్య పోటీ నెలకొంది. 2019 నుంచి రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రావడంతో అప్పటి నుంచి త్రిసభ్య కమిటీ సొసైటీ ఏర్పాటు చేయడంతో మాజీ సర్పంచ్ అధ్యక్ష పదవి, మరో ఇద్దరు బిసి, ఎస్సిలకు మెంబరు అవకాశం కల్పించారు. ఆ తర్వాత 2021లో బిసిలకు పెద్దపీట వేస్తున్నట్లు బిసి సామాజిక తరగతికి చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి అప్పగించారు. ఇప్పుడు మళ్లీ పలు అనారోగ్య కారణాలతో రాజీనామా చేయగా, మళ్లీ తెరపైకి బిసి, ఒసిలకు చెందిన ఒకే పార్టీ నాయకులు తనకంటే, తనకుంటూ గతవారం రోజుల క్రితం సొసైటీ భవనం వద్ద పోటీపడ్డారు. ఈ తగాదా ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు దగ్గరకు వెళ్లగా, ఆయన మండల నాయకులకు అప్పగించినట్లు తెలిసింది. కానీ రుణం తీసుకున్న గ్రామంలోని రైతులు మాట్లాడుతూ టాం, టాం ద్వారా రుణం పొందిన రైతులకు తెలియజేసి అందరి ఆమోదం పొందిన వ్యక్తిని పెట్టాలని, లేదా ఎప్పటి నుండో ఒసిలు అధ్యక్ష పదవి పొందుతున్నారని, ప్రస్తుతం బిసిలు చేశారని, ఈ నేపథ్యంలో ఎస్సి సామాజిక తరగతికి చెందిన అనుభవం ఉన్న వ్యక్తికి ఇవ్వాలని కోరుకుంటున్నారు.



ముసునూరు సొసైటీ భవనం

శిథిలావస్థకు పట్టిసీమ వంతెన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మర్రి బందం గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న పట్టిసీమ కాలువ వంతెనపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇనుప చువ్వలు బయటకు రావడంతో వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పైనుంచి బండిపై వెళ్తుంటే బ్రెయిన్ బర్రెస్ట్ అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో అధికారులు స్పందించి గుంతలలో కాంక్రీట్ వేయడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

107 మందికి కళ్లజోళ్లు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

కంటి చూపు తగ్గిన 107 మందికి అట్లూరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర మంగళవారం కళ్లజోళ్లు అందజేశారు. గత నెలలో నిర్వహించిన ఉచిత కంటి మెడికల్ క్యాంపులో 75 మందికి కంటి శస్త్ర చికిత్స నిర్వహించగా మిగిలిన వారికి కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి మాజీ సర్పంచ్ చొటపల్లి కిషోర్, పానుగంటి నాగేశ్వరరావు, వరుణ్ రవి, కెపి రాజబాబు, పివి నాగరాజు, ఎల్.కాంతారావు, శివాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు గడిచినా నేటికీ విడుదల చేయలేదని అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా కొకన్వీనర్ తోర్లపాటి.రాజు అన్నారు. సిపిఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. లేని పక్షంలో నిరుద్యోగ భృతి నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ్, శేఖర్, నక్కవంశీ పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీ కళాశాలలో కోతుల బెడద

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతున్న ట్రిబుల్ ఐటీ కళాశాల ప్రాంగణంలో రోజురోజుకీ పెరుగుతున్న కోతుల సంఖ్య కారణంగా విద్యార్థులు, సిబ్బంది తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. అనుక్షణం పర్యటించే సెక్యూరిటీ సిబ్బంది, విద్యార్థులు అనేకమంది కోతుల దాడిలో తీవ్రంగా గాయపడుతూనే ఉన్నామని వాపోయారు. తక్షణమే కోతులను తరిమేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పవన్ వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి - భీమడోలు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లను, వాలంటీర్ల వ్యవస్థను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యానాలు ఆరోపిస్తూ పొలసానిపల్లి పంచాయతీ వాలంటీర్లు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నోటికి నల్ల రిబ్బన్లను కట్టుకుని పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో అంబటి దేవి, నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: వాలంటీర్లపై పవన్కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో వాలంటీర్లు ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఆదివారం ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో వారాహి యాత్రలో భాగంగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన బహిరంగ సభలో వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వాలంటీర్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. కోట్ల రూపాయలు తీసుకుంటూ సినిమాల్లో నటించే పవన్ కళ్యాణ్కు ఐదువేల రూపాయల కనీస వేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వాలంటీర్లపై చిన్నచూపు తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు దామోదర్, పవన్, సురేష్, నజ్రీనా, వెంకటలక్ష్మి, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో పవన్ కళ్యాణ్ ఫోటోలను మంగళవారం దగ్ధం చేసారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్ర రావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేయడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్న వాలంటీర్లను చులకన భావంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వానికి, వాలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు.

అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి ఆరేపల్లి శిరీష అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పి వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపిడిఒ విజయ్ బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆంధ్రా సరిహద్దుల్లోని కుడుముల పాడు నుంచి వెంకటాపురం వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్ఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో పెద్ద పెద్ద గుంతల వద్ద జెండాలు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్ఎల్ పార్టీ జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కె.గౌస్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత రోడ్డు గురించి పట్టించుకున్న నాథుడే లేడన్నారు. 40 కిలోమీటర్ల మేర అశ్వారావుపేట, భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులతో చెరువులను తలపించేలా రోడ్డు తయారైందన్నారు. వర్షాకాలం రావడంతో గోతులలో నీరు చేరి ప్రమాదకరంగా మారాయని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ మండల కేంద్రంలో ఉన్న గోతుల వద్ద నిరసన తెలిపామన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణపనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతూ తహశీల్దారుకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్ ప్రజాపంథా నాయకులు బి.సత్యనారాయణ, కొండా.ప్రసాద్, లక్ష్మయ్య, ముత్తమ్మ, మున్నీ, వీరబాబు, కన్నయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆర్టిసి బస్సు డ్రైవర్పై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గుర్తుతెలియని వ్యక్తి ఆర్టిసి బస్సు డ్రైవర్ను కొట్టి తన వాహనంలో పరారైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు బాణావతు సక్రు కథనం మేరకు నూజివీడు డిపోకు చెందిన బస్సు చింతలపూడి పట్టణం నుంచి వస్తుండగా స్థానిక తిరువూరు బస్స్టాప్ కూడలి వద్ద ఎదురుగా వస్తున్న లారీ తగిలి బస్సు అద్దం పగిలింది. దీనిపై ప్రశ్నించినందుకు లారీలోని వ్యక్తి తనపై దాడి చేశాడని, సద్గురు నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మండవల్లి

చేపల చెరువుల గుమస్తాగా పని చేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన లేలపూడి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నిడమర్రు మండలం భువనపల్లి గ్రామానికి చెందిన కురిశెట్టి వెంకట రమణ మూర్తి(34) లేలపూడి గ్రామంలో గాదిరాజు కిరణ్ కుమార్ రాజు 60 ఎకరాల చేపల చెరువుపై గుమస్తాగా పని చేస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం రాత్రి 60 ఎకరాల చెరువులోకి నీరు తోడెందుకు వెళ్ళాడు. ఉదయం ఇంటికి రాకపోవడంతో భార్యభయాందోళన చెంది చెరువుదారుడికి చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. దీంతో వెంకటరమణమూర్తి ఆచూకీ కోసం చెరువు చుట్టూ ప్రాంతాలను వెతుకుతుండగా రమణమూర్తి చెరువు నీళ్లల్లో పడి ఉండడాన్ని గమనించి వెంటనే రమణమూర్తిని బయటకు తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రాజు తెలిపారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న తమ్మాజీ

మినీ జాబ్మేళాలో 43 మంది ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నూజివీడు శ్రీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూ నిర్వహించారు. మొత్తం 126 మంది అభ్యర్థులు మినీ జాబ్ మేళాకు హాజరుకాగా, 43 మంది అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీ తెలిపారు. విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ ఇద్రిస్, జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్, ఎన్సిఎస్ యూనిట్ ప్రొఫెషనల్ ప్రవీణ్, ఎడిఎస్డిఇ కిషోర్, కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులు మానవత్వం, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన పొందాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మోటివేషనల్ స్పీకర్, కోఆర్డినేటర్ తాటిపల్లి సుధీర్ తెలిపారు. మంగళవారం స్థానిక సిఎస్టిఎస్ కళాశాలలో మానవత్వ నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై తెలుగు శాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులకు మానవత్వాన్ని, విద్యలో నైపుణ్యాభివృద్ధిని, ఉద్యోగ సముపార్జన నైపుణ్యాన్ని సాధించుకునే మార్గాలను తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్బాబు ఆధ్వర్యంలో తాటిపల్లి సుధీర్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతులతో ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి - చింతలపూడి


ప్రధాన రహదారి మొత్తం పెద్ద పెద్ద గుంతలతో ప్రజలకు, ప్రయాణీకులకు ఇబ్బందిగా మారింది. పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకూ గుంతలతో ప్రయాణం చేయలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు వెంబడి ప్రయాణించాలంటేనే.. ప్రయాణం నరకయాతనగా మారింది. అధికారులు రోడ్లపై దృష్టి పెట్టి కనీసం మరమ్మతులైనా చేయించాలని కోరుకుంటున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

భీమడోలు: చేపల చెరువులకు మేతగా నిషేధిత కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఒక వాహనాన్ని భీమడోలు రైల్వే గేట్ వద్ద మంగళవారం సాయంత్రం పట్టుకున్నట్లు భీమడోలు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన జయ మంగళ ఆనందకుమార్ ఖమ్మంలోని వివిధ చికెన్ దుకాణాల నుంచి సేకరించిన సుమారు 1500 కేజీల కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో నింపి వాహనంలో లోడు చేసుకుని వాటిని మండలంలోని కురెళ్లగూడెం ప్రాంతంలో గల చేపల చెరువులకు మేతగా తరలించేందుకు బయలుదేరారు. భీమడోలు రైల్వే గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు తనిఖీల సందర్భంగా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం పట్టుబడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడపాటి లక్ష్మమ్మకు జిల్లా స్థాయి అవార్డు

ప్రజాశక్తి - భీమడోలు



గూడపాటి లక్ష్మమ్మకు జిల్లా స్థాయి అవార్డు అందిస్తున్న కలెక్టర్

గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామ సచివాలయం-2కు చెందిన గూడపాటి లక్ష్మమ్మ అంతర్ ఇంజక్షన్ గర్భనిరోధక విధానాన్ని అమలు చేసినందుకు ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికయ్యారని పిహెచ్సి వైద్యులు డాక్టర్ లక్ష్మి తెలిపారు. ఈ అవార్డును ఏలూరులో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ ఆశా గూడపాటి లక్ష్మికి అందజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోని గుండుగొలను, పూళ్ళ పిహెచ్సిల వద్ద సంబంధిత ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ లీలాప్రసాద్, కళ్యాణ మహేశ్వరి, లక్ష్మీల ఆధ్వర్యంలో ఆయా పురవీధుల్లో సిబ్బంది ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అధిక జనాభా వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అమలులోనికి వచ్చిన అధునాతన, నూతన గర్భనిరోధక పద్ధతులు గురించి తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అవార్డు సాధించిన గూడపాటి లక్ష్మమ్మ, వైద్యులు పిహెచ్సి సిబ్బంది, పిహెచ్సి మండల స్థాయి ఛైర్మన్, భీమడోలు ఎంపిపి అధ్యక్షులు కనుమాల రామయ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒలు కిషోర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అటకెక్కిన పారిశుధ్య వాహనాలు



వినియోగానికి నోచుకోని వాహనాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ చెత్త సేకరణ వాహనాల వినియోగానికి నోచుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల క్లీన్ ఆంధ్రప్రదేశ్ పథకంలో భాగంగా మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణ కొరకు పారిశుధ్య వాహనాలు 9 కేటాయించారు. వాహనాలను ఆర్భాటంగా ఎంఎల్ఎ ఉండమట్ల ఎలిజ సమక్షంలో ప్రారంభించారు. ఎప్పటికీ ఈ వాహనాలు వినియోగంలోకి రాకపోవడంపై స్థానికుల అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన రిక్షాలతో పారిశుధ్య కార్మికులు చెత్త తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఆధునిక యంత్రాలతో చెత్త సేకరణ వేగవంతం అవుతుందని భావించినా.. ప్రజలకు రోజురోజుకూ నిరాశ ఎదురవుతుందని పలువురు భావిస్తున్నారు. పారిశుధ్య వాహనాల వినియోగం వెంటనే ప్రారంభించి పట్టణ వీధులలో చెత్త లేకుండా పరిశుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్ వివరణ అడగగా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి క్లీన్ ఆంధ్రప్రదేశ్లో మొదటి విడతగా 9 చెత్త సేకరణ వాహనాలు ప్రభుత్వం సరఫరా చేసిందని తెలిపారు. రెండవ విడతలో మరో ఆరు వాహనాలు వస్తాయన్నారు. లాంఛనంగా వాహనాలను ప్రారంభించినప్పటికీ నిబంధనలు ప్రకారం వాహన రిజిస్ట్రేషన్లు జరగలేదని తెలిపారు. గుత్తేదారు ద్వారా వాహన రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుక్కులూరు గ్రామం నుంచి టిడిపి శ్రేణులు మంగళవారం పాదయాత్ర ప్రారంభించారు. టిడిపి సీనియర్ నేత మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కాటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర 2,000 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా సంఘీభావంగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 150 రోజులపాటు రెండు వేల కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం మండలంలో సంఘీభావ యాత్ర నిర్వహించారు. పోలవరం పంచాయతీ జగన్నాథ పేట వినాయకుని గుడి వద్ద నుంచి గ్రామదేవత కడమ్మ ఆలయం వరకూ పోలవరం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ, పోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఎన్నో అడ్డంకులు, సమస్యలతో ప్రారంభమైన యువగళం పాదయాత్ర ప్రజా మద్దతుతో నేటికి 2,000 కిలోమీటర్లు పూర్తి చేసుకోవడం హర్షణీయమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక నిర్మలా ఆసుపత్రి నుంచి అశ్వరావుపేట రోడ్డులోని ఎన్టిఆర్ విగ్రహం వరకూ సంఘీభావయాత్ర చేపట్టారు. మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి, టిడిపి మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగ్గవరపు ముత్తారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతంలో ప్రాముఖ్యత కలిగిన ఎర్ర కాలువ జలాశయంలో అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టాలని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన యువగళం సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న ఘంటా మురళి మాట్లాడుతూ ఎర్రకాలువ జలాశయంలో 20 నుండి 30 అడుగుల లోతు గోతులు తవ్వుతూ మట్టి రవాణా చేయడం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి: నారా లోకేష్ను చూసి వైసిపి నాయకుల వెన్నులో వణుకు పుడుతోందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జ్ మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను అనేక అవాంతరాలు సృష్టించిన నారా లోకేష్ ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అట్లూరి చారిటబుల్ ట్రస్టు, అట్లూరి రవీంద్ర, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కొండ మంగయ్య పాల్గొన్నారు.

మండవల్లి: జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి కైకలూరు నియోజకవర్గం పరిశీలకుడు మెంతే పార్థసారథి విమర్శించారు. మండవల్లి ప్రధాన సెంటర్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి నాయకులతో, కార్యకర్తలతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు, ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి మండలాల టిడిపి అధ్యక్షులు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులు నష్టపోకూడదనే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ముదినేపల్లి

అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా నష్ట పోకూడదనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వైసిపి మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు అన్నారు. దేవపూడి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్నా పొందని వారు మళ్లీ ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను అధికారులు స్వీకరించారు. పలువురుకి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను ప్రజాప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, గ్రామ సర్పంచి దాసరి కాశీ అన్నపూర్ణ, ఎంపిటిసి గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచులు, ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, నాయకులు బొర్రా శేషుబాబు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భీమడోలు: గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని భోగాపురం ఆవాస ప్రాంతానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయాలని గ్రామస్తులు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్యకు విజ్ఞప్తి చేశారు. గుండుగొలను గ్రామ సచివాలయం-మూడు పరిధిలోని భోగాపురంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచి, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ముదుంది సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఒక ఎయిడెడ్ పాఠశాల మూతపడగా, దానికి చెందిన విద్యార్థులను మిగిలిన రెండవ ఎయిడెడ్ పాఠశాలలో సర్దుబాటు చేశారన్నారు. అక్కడ పాఠశాల నిర్వహణకు కనీస సౌకర్యాలు లేవని, శాశ్వత ఉపాధ్యాయులు లేనందున స్థానిక విద్యార్థులకు విద్య దూరమైందని ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మండల ఎంపిపి సమస్యను ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకువెళ్లి, ఆయన సహాయ సహకారాలతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రామ ఉప సర్పంచి మాట్లాడుతూ 457 నివాసాలు ఉన్న ఆప్రాంతంలో నిర్వహించిన జగనన్న సురక్ష సందర్భంగా 343 దరఖాస్తుల పరిష్కారానికి టోకెన్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి, తహశీల్దార్ ఇందిరాగాంధీ, పంచాయతీ విస్తరణాధికారి ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శి మురళి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: రాళ్లకుంట గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు చేరాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న సురక్షను చేపట్టిందన్నారు. ప్రజలంతా వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టారని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్షను సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతున్నాయని తెలిపారు. జగన్మోహన్రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, కొనకళ్ల సర్వేశ్వర రావు, అధికారులు పాల్గొన్నారు.



టి.నరసాపురం మండలంలోని బొర్రంపాలెంలో...

ప్రమాదకరంగా గొయ్యి

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీనివాసపురం రోడ్డు ప్రధాన రహదారిలో గేటు వాల్ నిర్మాణం కోసం తీసిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. ఒకవైపు 27,28,29 వార్డుల నుంచి, మరోవైపు శ్రీనివాసపురం మైసన్నగూడెం ఏజెన్సీ గ్రామాల నుంచి పట్టణంలోకి రావడానికి ప్రధాన రహదారిలో ఇటువంటి గోతులను నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ద్వారకాతిరుమలలో అన్నసమారాధన

ద్వారకాతిరుమల: తూర్పు వీధిలోని ఆంజనేయస్వామి గుడి వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం భారీ అన్న సమారాధన చేశారు. వెంకటేశ్వరస్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శ్రీవేంద్ర త్రినాథరావు, టిడిపి నాయకులు మొగతాడకల శ్రీనివాసరావు హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు.

కార్యాచరణ కమిటీలు అభినందనీయం

మండవల్లి: గ్రామాభివృద్ధికి మూలమైన కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరావు అన్నారు. కార్యాచరణ కమిటీలను వేయాలని స్పందనలో కోరగా వెంటనే స్పందించి విస్తరణ అధికారి ఆనందబాబు కమిటీలను వేయడంపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక మండల అధ్యక్షులు టి.అప్పారావు పాల్గొన్నారు.